వైద్య కళాశాల నిర్మాణంలో గత వైసీపీ ప్రభుత్వం మూడేళ్లుగా నిర్లక్ష్యం చేసింది. అప్పటి పాలకులు భూ సేకరణలో చూపిన శ్రద్ధ కళాశాల నిర్మాణాలు పూర్తి చేయడంలో చూపలేదు. శంకుస్థాపన చేసిన ఏడాదికి పునాదులు తీశారు. అప్పటికైనా పనుల్లో వేగం పుంజుకుందా.. అంటే అదీ లేదు. 20 శాతం కూడా పూర్తి చేయలేకపోయారు. ఎక్కడి నిర్మాణాలు అక్కడే అన్నట్లుగా ఉండిపోయాయి. రూ.25 కోట్లు బిల్లులు చెల్లించకుండా బకాయి పెట్టారు. చేసిన తప్పును ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వంపై నెట్టేందుకు వైసీపీ నాయకులు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే విస్తుగొలిపే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. కళాశాల భవనాలు ఎక్కడికక్కడే అసంపూర్తిగా ఆగిపోయాయి.



అసంపూర్తిగా ఆదోని మెడికల్ కాలేజీ అకాడమిక్ భవనం

నాడు నిర్లక్ష్యం.. నేడు నిందలు..!

- గత వైసీపీ హయాంలో దాటని 20 శాతం పనులు
- అసంపూర్తిగా అకాడమిక్, ఐపీడీ బ్లాక్ భవనాలు
- రూ.71 కోట్ల పనులు చేస్తే.. రూ.24 కోట్ల బకాయి
- సర్వే దశలోనే తాగునీటి పైపులైన్ పనులు
- ఆదోని మెడికల్ కళాశాల దుస్థితి ఇది
- జగన్ తప్పిదాలను కూటమి ప్రభుత్వంపై నెట్టేందుకు యత్నాలు

కర్నూలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో ఒకటి ఆదోని మెడికల్ కాలేజీ. 420 బెడ్స్ బోధనాస్పత్రి ఇది. 2024-25 విద్యా సంవత్సరంలో వైద్యవిద్య తరగతులు ప్రారంభిస్తాం అంటూ ఆర్భాటం చేశారు. నాబార్డు రుణం రూ.475 కోట్లతో నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. 13.31 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో బోధనాసుపత్రి, మెడికల్ కాలేజీ, రెసిడెన్సియల్ స్టాఫ్ క్వార్టర్స్, నర్సింగ్ కాలేజీ, విద్యార్థుల వసతి గృహాలు, జూనియర్, సీనియర్ రెసిడెన్స్ హాస్టల్, నర్సింగ్ విద్యార్థుల వసతి గృహం, వర్కింగ్ స్టాఫ్ నర్స్ క్వార్టర్స్, హాస్టల్, సెంట్రల్ కిచెన్, డైనింగ్, ఎంజీపీఎస్ ప్లాంట్ రూమ్స్, లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, బయో మెడికల్ వేస్ట్ ప్లాంట్ రూమ్స్, సెంట్రల్ డ్రగ్ స్టోర్, లాండ్రీ, మార్చురీ వంటి భవన నిర్మాణాలు (సివిల్ పనులు) రూ.350 కోట్లతో చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్‌ఐడీసీ) పర్యవేక్షణలో చేపట్టిన ఈ పనులు విజయవాడకు చెందిన కేఎంవీ గ్రూప్ సంస్థ పెట్టింది. 2021 మే 31న అప్పటి సీఎం జగన్ వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. 30 నెలల్లో పూర్తి చేయాలన్నది ఒప్పందం. వివిధ కారణాలతో గత వైసీపీ ప్రభుత్వం ఏడాదిన్నర (18 నెలలు) జాప్యం చేసింది. కాంట్రాక్ట్ సంస్థ 2022 డిసెంబరు 26న ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో ఒప్పందం చేసుకుంది. ఈ లెక్కన 2025 జూన్ ఆఖరి నాటికి వంద శాతం పనులు పూర్తి చేయాల్సి ఉంది.



ఆదోని మెడికల్ కాలేజీ బాలికల హాస్టల్ భవన నిర్మాణం

● భూ సేకరణపై శ్రద్ధ.. నిర్మాణంపై నిర్లక్ష్యం..!

ఆదోని మండలం ఆరేకల్లు సమీపంలో 167 నంబర్ జాతీయ రహదారికి ఆనుకుని ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం దాదాపు 59.50 ఎకరాలు సేకరించారు. ఎకరం రూ.40 లక్షలు ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేశారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలాలతో పాటు చివరి భూములకు కూడా ఇదే ధర నిర్ణయించడంపై పలు విమర్శలు వెల్లువెత్తున్నాయి. అప్పటి అధికార వైసీపీ ముఖ్య నాయకుడు, ప్రస్తుత మాజీ ప్రజాప్రతినిధి ఒకరు భూ సేకరణలో పెద్దఎత్తున మాయ చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఎన్‌హెచ్ రోడ్డు పక్కనే ఉన్న పొలం రైతుల నుంచి ఎకరానికి రూ.1.5 నుంచి రూ.2 లక్షలు, చివర్లో ఉన్న భూములు రైతుల నుంచి రూ.3-5 లక్షలకు పైగా అక్రమ వసూలు చేశారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రూ.కోట్లు అక్రమంగా వస్తుండడంతో భూ సేకరణపై చూపిన శ్రద్ధ.. ఆ తరువాత మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణాలపై చూపలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఆదోని మెడికల్ కాలేజీలో వివిధ భవనాల నిర్మాణాలు ఇలా

ఒప్పందం ప్రకారం 30 నెలల్లో కాంట్రాక్టరు మెడికల్ కాలేజీ 13.31 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వివిధ భవన నిర్మాణాలు అన్ని హంగులతో పూర్తి చేసి ఏపీఎంఎస్ఐడీసీకి అప్పగించాల్సి ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో పనులు చేస్తే బిల్లులు సకాలంలో రావనే భయం కాంట్రాక్ట్ సంస్థను వెంటాడడం, అప్పటి పాలకులు కూడా పెద్దగా దృష్టి సారించకపోవడం వెరసి ఎక్కడి పనులు అక్కడే అన్నట్లుగా మారాయి. జూన్ 12 వరకు జగన్ ప్రభుత్వం ఉంది. ఆ సమయానికి ఒప్పందం చేసుకొని 18 నెలలు గడిచింది. అప్పటికే 65-75 శాతం రూ.225-260 కోట్లకు పైగా విలువైన పనులు చేసి ఉండాలి. అదే జరిగి ఉంటే కాలేజీ ప్రారంభోత్సవానికి దాదాపుగా సిద్ధమయ్యేదని ఇంజనీర్లే అంటున్నారు. వాస్తవ పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. గత

రూ.24 కోట్ల బకాయి

సీఎం జగన్ శంకుస్థాపన చేసిన ఏడాదిన్నర వరకు కనీసం ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. పైగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఒప్పందానికి ఏడాదిన్నర కాలం గడిపేశారు. ఆ తర్వాత అయినా పురోగతిలో వేగం పెంచారా..? అంటే అదీలేదు. ఫలితంగా ఇప్పటి వరకు కేవలం రూ.71 కోట్లు విలువైన పనులు మాత్రమే చేశామని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాకముందు వరకు కేవలం 20 శాతం పనులు మాత్రమే చేశారు. చేసిన పనుల్లో నేటికి రూ.24 కోట్లు బిల్లులు బకాయి పెట్టారని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు వాపోయారు. ఒక్క బాలికల హాస్టల్ భవనం మాత్రమే నిర్మాణం పూర్తయినా రంగులు, ఎలక్ట్రికల్ వంటి పనులు చేయాలి. కాలేజీ, అకాడమిక్ భవనాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. పులికనుమ రిజర్వాయర్ నుంచి తాగునీటి పైపులైన్ పనులకు రూ.30 కోట్లు కేటాయించారు. ఈ పనులు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లకు అప్పగించారు. సర్వే టెండర్ల దశ దాటడం లేదు. నాడు అధికారంలో ఉండి మెడికల్ కాలేజీల నిర్మాణంలో అంతులేని నిర్లక్ష్యం.. జాప్యం చేసిన వైసీపీ నాయకులు తమ తప్పును కప్పిపుచ్చుకోడానికి నేడు టీడీపీ కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ఆరోపించారు.

పేదింటి చాంపియన్

- చైనాలో భారత్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్న ఆలూరు క్రీడాకారుడు

ఆలూరు, సెప్టెంబరు 16 : ఆలూరు పట్టణంలో గోబి మంచూరియా షాప్ పెట్టుకొని జీవనం సాగిస్తున్న బసవరాజు కుమారుడు కె.మధు జాతీయ స్థాయి సెపక్ తక్రా క్రీడల్లో రాణిస్తూ ఎన్నో పతకాలు సాధించాడు. తల్లిదండ్రులకు చేదోడుగా గోబీ షాప్‌లో గోబీలు, నూడూల్స్ తయారు చేస్తూ మరోవైపు ఆటలో నైపుణ్యం సాధించాడు. ఇప్పటికే 15 సార్లు జాతీయ స్థాయిలో, 10 సార్లు రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని సత్తా చాటాడు.



ఆసియా బీచ్ సెపక్ తక్రా చాంపియన్ షిప్‌కు ఎంపికైన క్రీడాకారుడు మధు

వివిధ రాష్ట్రాల నుంచి ఏడుగురి ఎంపిక

ఆలూరు పట్టణంలో సెయింట్ జాన్స్ స్కూల్‌లో 1 వరకు చదువుకున్న మధుకు పీఈటీ హనుమంతు రెడ్డి సేపక్ తక్రా క్రీడను పరిచయం చేశారు. క్రీడల్లో నైపుణ్యం సాధించిన మధు ఇంటర్, డిగ్రీ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో చదివే సమయంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక పతకాలు సాధించాడు. తాజాగా ఆసియా బీచ్ సెపక్ తక్రా చాంపియన్‌షిప్ 2024 పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆలూరుకు చెందిన మధు ఉండడం విశేషం. ఈ నెల 18 నుంచి 23 వరకు చైనాలోని కింగ్ డావోలో జరగనున్న యూ-23 ఆసియా బీచ్‌లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా తల్లి దండ్రులు, ఆలూరు క్రీడాకారులు, మిత్రులు క్రీడాకారుడు మధుకు అభినందనలు తెలిపారు.



ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారుడు మధు

ఆనందంగా ఉంది

జాతీయ స్థాయిలో ఆసియా బీచ్ సెపక్ తక్రా చాంపియన్ షిప్ 2024కు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. నా తల్లిదండ్రులు బసవరాజు, సరస్వతి, నా గురువు హనుమంతు రెడ్డి ప్రోత్సాహంతో క్రీడల్లో సాధన చేసి అనుకున్న లక్ష్యానికి చేరుకున్నాను. చైనాలో జరిగే పోటీల్లో భారత్ జట్టు నుంచి ఆడనుండడం గర్వంగా ఉంది.

క్రీడాకారుడు మధు

శ్రీశైలానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో



శ్రీశైలం డ్యాం

శ్రీశైలం, సెప్టెంబరు 16: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి సోమవారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. జూరాల నుంచి 27,447 క్యూసెక్కులు, సుకేసుల నుంచి 11,238 క్యూసెక్కులు మొత్తం 38,685 వరద వస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 40,764 క్యూసెక్కుల మేర వరద వచ్చింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 882.50 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 202.0439 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,867 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

ప్రవక్త మార్గంలో సాగాలి

మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 16: మహ్మద్ ప్రవక్త బోధించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం మిలాద్-ఉన్-నబీని ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. వేడుక ఈ సందర్భంగా నగరంలోని సెంట్రల్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో పాతనగరంలోని లావుబాలీ దర్గా నుంచి రాజ్ విహార్ వరకు వేలాది మంది ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. రాజ్ విహార్ సెంటర్‌లో కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. మిలాద్ కమిటీ వ్యవస్థాపకుడు అహ్లె సున్నతుల్ జమాత్ అధ్యక్షుడు సయ్యద్‌షా షఫీపాషా ఖాద్రి అధ్యక్షతన జరిగిన ఈ సభలో పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్, మత పెద్దలు సయ్యద్ దాదాబాషా ఖాద్రి, వక్తలుగా హైదరాబాదుకు చెందిన సయ్యద్ ఖాశిఫ్ పాషా, వరంగల్‌కు చెందిన ఆకాశవాణి వ్యాఖ్యాత సయ్యద్ ముగ్దుం మోహియుద్దీన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త సూచించిన విధంగా ప్రజలంతా శాంతియుత జీవనాన్ని ఆచరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ మిలాద్ కమిటీ పక్షాన ముగ్గురిని లక్కీ డ్రాలో ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా ఉమ్రా (మక్కాయాత్ర)కు సంబంధించిన టికెట్లు అందజేశారు.



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఉందామా.. వెళ్లి పోదామా..?

- డైలామాలో ప్రభుత్వ ఉద్యోగులు
- తెలుగు తమ్ముళ్ల తీరుతో విసిగిపోయిన వైనం
- ఒత్తిడి తట్టుకోలేక దీర్ఘకాలిక సెలవులో ఎంఈవో

కోడుమూరు, సెప్టెంబరు 16: కోడుమూరు మండలంలో ఉందామా.. లేక బదిలీ చేయించుకొని వెళ్లి పోదామా అనే ఆలోచనలో కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు డి.విష్ణువర్ధన్‌రెడ్డి వర్గీయులు చేస్తున్న గ్రూపు రాజకీయాల వల్ల అధికారులు విసుగెత్తారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన అనంతరం గల్లీ స్థాయి నాయకుడు కూడా ప్రభుత్వ ఉద్యోగులపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఆదాయం కోసం అడ్డదారులు తొక్కే ప్రయత్నాలు మొదలు పెట్టారు. కొంత మంది గల్లీ స్థాయి నాయకులు గ్రూపులుగా విడిపోయి నాయకులు స్వలాభం కోసం అధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసుస్టేషన్, తహసీల్దార్, మండల ప్రజా పరిషత్, హౌసింగ్, విద్యా వనరుల కేంద్రం, వ్యవసాయం, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్ తదితర శాఖల చుట్టేయడం వీళ్ల పని. అధికారుల ముందు దర్జాగా కూర్చొని 'మా నాయకుడు మండల బాధ్యతలు చెప్పారు. మేము చెప్పిందే మీరు చేయాలి. లేదంటే అన్నకు చెప్పి నిన్ను బదిలీ చేయిస్తాం' అని గంటకు ఓ గ్రూపు నాయకులు వచ్చి ఉద్యోగులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తెలుగు తమ్ముళ్ల వ్యవహారంతో విసుగు చెందిన అధికారులు ఇక్కడి నుంచి వెళ్లిపోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు.

కోడుమూరును ఏం చేద్దాం

2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేసి టీడీపీకి మెజారిటీ అందించిన కోడుమూరు మండల ప్రజల సమస్యలను ఎలా పరిష్కరించాలని ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నాయకుడు డి.విష్ణువర్ధన్‌రెడ్డి ఆలోచిస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచు ఎన్నికల్లో విజయం సాధించాలని దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని అడుగులు వేస్తున్నారు. ఇలాంటి తరుణంలో రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకోకుండా పార్టీలోని కొంత మంది చోటామోటా నాయకులు పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారు. పార్టీలోని కొంత మంది చేస్తున్న తప్పిదాలను దాటుకొని ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఏం చేద్దామని పార్టీ పెద్దలు ఆలోచనలో పడ్డారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు కోడుమూరుపై దృష్టి సారించి తెలుగు తమ్ముళ్లను అదుపు చేయకపోతే పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పార్టీ శ్రేణులు హెచ్చరిస్తున్నాయి.

దీర్ఘకాలిక సెలవులో ఎంఈవో

కోడుమూరు పట్టణంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం బాధ్యతలు తమకే ఇవ్వాలని ఎంఈవో శరభయ్యపై తెలుగు తమ్ముళ్లు ఒత్తిడి తీసుకొచ్చారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులను మార్చాలంటే నిబంధనలు ఉన్నాయని, ఆ దిశగా ఆలోచిస్తామని కొంత టైం ఇవ్వాలని ఎంఈవో గడువు కోరారు. తాను సెప్టెంబరు చివరిలో రిటైర్డ్ అవుతానని, తనను ఇబ్బంది పెట్టకండంటూ ఎంఈవో తెలుగు తమ్ముళ్లను వేడుకున్నారు. ఇవేవి పట్టించుకోని నాయకులు ఎంఈవో తమ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని, వైసీపీ నాయకులు చెప్పినట్లు వ్యవహరిస్తున్నాడని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. దీంతో తన ఉద్యోగాన్ని కాపాడుకోవాలని ఆ ఎంఈవో దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లిపోయారు.

శాఖలను పంచుకున్న తెలుగు తమ్ముళ్లు

ప్రభుత్వం వచ్చిన వెంటనే కొంత మంది టీడీపీ నాయకులు ప్రభుత్వ శాఖలను పంచుకున్నారు. ఆయా శాఖల్లో పనులు కావాలంటే ఎవరైనా తమను సంప్రదించాలని ఎవరికి వాళ్లు నిర్ణయించుకున్నారు. డీలర్‌షిప్ ఇప్పిస్తానని ఒక నాయకుడు ప్రచారం చేసుకుంటే... రెవెన్యూ వ్యవహారం, మధ్యాహ్న భోజనం నిర్వహణ, పోలీసు, మండల పరిషత్, పంచాయతీ రాజ్ శాఖలు తమవే అంటూ మరికొంత మంది నాయకులు చెప్పుకొని తిరుగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల బాధ్యతలు తనకే అప్పగించాడని ఇంకో నాయకుడు ప్రచారం చేసుకుంటున్నాడు. అంతేగాకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయిస్తామంటూ కొంత మంది నాయకులు డబ్బులు వసూలు చేయడం కూడా ప్రారంభించారు. బదిలీల విషయంలో తనదే పై చేయిగా ఉండాలని గల్లీ స్థాయి నాయకులు కూడా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముందు వాలిపోయి మండలంలో గందరగోళం సృష్టిస్తున్నారు. దీంతో బదిలీలు విషయం ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారింది.



3 నుంచి దసరా ఉత్సవాలు

మహానంది ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, సెప్టెంబరు 16: దసరా ఉత్సవాలను వచ్చే నెల 3వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు మహానంది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం మహానంది దేవస్థానం ప్రధాన కార్యాలయంలో శరన్నరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఆలయ ప్రాంగణంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామని అన్నారు. ప్రత్యేక యాగశాలల్లో హోమాలు, కుంకుమార్చన పూజలు ప్రత్యేక రుత్వికులు చేపడతారని వివరించారు. రోజుకో అలంకారంతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డితోపాటు ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర్ అవధాని, ఉప ప్రధాన అర్చకులు జనార్దన్‌శర్మలు పాల్గొన్నారు.

నేటి నుంచి వంట ఏజెన్సీ మహిళలకు శిక్షణ

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 16: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే కుక్‌లకు, హెల్పర్లకు ఈ నెల 17 నుంచి 21 వరకు మ్యాపింగ్ చేయబడిన పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1433 పాఠశాలల వంట మనుషులకు, అసిస్టెంట్ కుక్‌లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. శిక్షణలో నాణ్యమైన భోజనం ఎలా తయారు చేసి అందించాలో నిపుణులతో శిక్షణ ఇప్పించనున్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విధిగా కుక్‌లను, హెల్పర్లను శిక్షణకు పంపాలన్నారు. అలాగే ఎంఈవోలు శిక్షణ కార్యక్రమాలకు హాజరు కావాలని డీఈవో సూచించారు.

మంత్రాలయంలో కర్ణాటక హైకోర్టు జడ్జి



మంచాలమ్మ సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర

మంత్రాలయం, సెప్టెంబరు 16: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర కుటుంబ సమేతంగా సోమవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి మంత్రాలయంలో ఆయన బస చేశారు. సోమవారం గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. వీరి వెంట ఎస్ఐ పరమేష్ నాయక్, మఠం సిబ్బంది బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, హరినాథ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి ఉన్నారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

వైభవంగా ద్వాదశి వేడుకలు



స్వర్ణరథంపై ప్రహ్లాదరాయలు ఊరేగింపు

మంత్రాలయం, సెప్టెంబరు 16: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ద్వాదశి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణబోధ పూజా మందిరంలో మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను ఉంచి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె నోటీసు

బేతంచెర్ల, సెప్టెంబరు 16: మండలంలోని సిమెంటు నగర్‌లో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ యజమాన్యానికి కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. కార్మికులు యూనియన్ జనరల్ సెక్రటరీ మోజెస్ ఫ్యాక్టరీ ప్రతినిధికి సోమవారం అందజేశారు. సిమెంటు ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు పాత బకాయిలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని ఆయన అన్నారు. సోమవారం నుంచి వారం రోజుల్లోగా తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకుంటే ఫ్యాక్టరీ గేటు ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు రామాంజనేయులు, రామసుబ్బయ్య నాయుడు, ఆనీఫ్, శేఖర్, గొల్ల సుబ్బయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



బాధితురాలు గోవిందమ్మతో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు16: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట ఘటనలో నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పౌరహక్కుల సంఘం, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కరీంబాషా, అల్లబకాష్, వెంకటేశ్వర్లు, అడ్వకేట్ ఇస్మాయిల్, నటరాజ్, సుబ్బరాయుడులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లుకుంట గ్రామంలో ఈ నెల 12న దళిత గోవిందమ్మపై జరిగిన దాడి ఘటనపై పౌరహక్కుల సంఘం, కుల నిర్మూలన పోరాట సమితి సంయుక్తంగా నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి గ్రామంలో పర్యటించింది. అన్ని కులాల వారిని కలిసి విచారించటంతోపాటు బాధితురాలు గోవిందమ్మతో మాట్లాడి వాస్తవాలు సేకరించారు. గోవిందమ్మపై దాడి చేసేందుకు కుట్ర పన్నిన బీసీ ఆధిపత్య కులాలపై ఎలాంటి కేసు నమోదు చేయకపోవటం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఇంత దారుణ ఘటన జరిగినప్పటికీ ఆదోని సబ్ కలెక్టర్, కలెక్టర్‌లు గ్రామాన్ని సందర్శించకపోవటం, బాధితురాలిని పరామర్శించకపోవటం బాధాకరమన్నారు. మొదట్లోనే వారిపై ఎస్సీ, ఎస్టీ, పీఓఏ కేసులు పెట్టి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదని అన్నారు. ఈ నిజనిర్ధారణ కమిటీలో హనుమంతు, ఉరుకుందు, సంజీవ్‌లు ఉన్నారు.

ఈఎన్‌టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జయప్రకాష్ రెడ్డి



డా.బి.జయ ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 16: చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన సీనియర్ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డా.బిజయప్రకాష్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో రాష్ట్రంలోని భీమవరంలో రాష్ట్ర 42వ ఈఎన్‌టీ వైద్యుల మహాసభ జరిగింది. ఈ సదస్సులో గత 30 ఏళ్లుగా రోగులకు సేవలందిస్తూ ఆధునిక పరికరాలతో క్లిష్టతరమైన శస్త్ర చికిత్స చేస్తూ తాను నేర్చుకున్న నైపుణ్యాన్ని నూతన వైద్యులకు శిక్షణ ఇస్తున్న డా.జయప్రకాష్ రెడ్డి సేవలు గుర్తించి రాష్ట్ర అధ్యక్షుడిగా సంఘం నియమించింది. డా.జయప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి లో ఈఎన్‌టీ వైద్య రంగం మెరుగుదలకు కృషి చేస్తున్నారు. అనంతరం చెవిలో చీము కారే రోగులపై అత్యాధునిక పరికరాలతో ఆపరేషన్ చేసిన ప్రదర్శనకు డా.శివరామకృష్ణ స్మారక గోల్డ్ మెడల్ ఆయనకు లభించింది. అలాగే చిన్న పిల్లల్లో వచ్చే ట్రాన్సిల్ శస్త్రచికిత్స ప్రదర్శనకు రజక పతకం లభించినట్లు ఆయన తెలిపారు.

కడప జోనల్ క్రికెట్ అకాడమీ చైర్మన్‌గా గోవిందరెడ్డి



కేజీ గోవిందరెడ్డి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 16: కడప జోనల్ క్రికెట్ అకాడమీ చైర్మన్‌గా కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఉన్న డా.కేజీ గోవిందరెడ్డిని నియమిస్తూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని ఉత్తర్వులు జారీ చేశారు. గత 25 ఏళ్లుగా కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవిందరెడ్డి పని చేస్తున్నారు. ఆయన సేవలను ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ గుర్తించి కడప జోనల్ (కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప) క్రికెట్ అకాడమీ చైర్మన్‌గా నియమించింది. కడప జోనల్ క్రికెట్ చైర్మన్‌గా ఎన్నికైన గోవిందరెడ్డికి జిల్లా క్రికెట్ అసోసియేషన్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నాయకులు అభినందనలు తెలిపారు.

20 గంటల పాటు నిమజ్జనం

వీహెచ్‌పీ కార్యాలయ గణపతికి వీడ్కోలుతో ముగిసిన ఉత్సవాలు







కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 16: నగరంలో వినాయకుడి నిమజ్జనోత్సవం 20 గంటలపాటు సాగింది. వీహెచ్‌పీ కార్యాలయ గణపతికి వీడ్కోలుతో కార్యక్రమం ముగిసింది. తొమ్మిది రోజులపాటు కన్నుల పండువగా సాగిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఉదయం 10 గంటలకు చివరి విగ్రహం నిమజ్జనంతో ముగిశాయి. నగర నడిబొడ్డున గల కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు రెవెన్యూ కాలనీలోగల విశ్వహిందూ పరిషత్ కార్యాలయ ఆవరణలోని భరతమాత గుడిలోని వినాయకుడి విగ్రహాన్ని చివరగా ఉత్సవ ప్రతినిధులు నిమజ్జనం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గణేశ్ మండపాల్లో రెండు వేలకు పైగా విగ్రహాలు నెలకొల్పగా వాటిని నిర్వాహకులు ఆదివారం ఆలస్యంగా తరలించారు. వినాయక ఘాట్‌లోనూ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సిన నిమజ్జనం ఆలస్యంగానే మొదలైంది. దీంతో సోమవారం ఉదయం వరకు భారీ విగ్రహాలను కేసీలో నిమజ్జనం చేస్తూనే ఉన్నారు. కాగా సోమవారం ఉదయం 10 గంటల సమయంలో చివరి విగ్రహాన్ని నిమజ్జనం చేసి ఉత్సవం పూర్తయినట్లు గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు ప్రకటించారు.

సైబర్ నేరగాళ్ల బురిడీ

వ్యాపారుల నుంచి రూ.కోటిపైనే వసూలు



ఆదోని, సెప్టెంబరు 16 : సైబర్ నేరగాళ్ల వ్యాపారులను బురిడీ కొట్టించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులమని చెప్పి వ్యాపారుల నుంచి రూ.కోటిపైనే వసూలు చేశారు. వివరాలు ఇలా.. ఆదోని పట్టణంలోని వ్యాపారులకు కొంతమంది వ్యక్తులు ఇన్‌కమ్ టాక్స్ అధికారులమంటూ ఫోన్ చేశారు. 'మీ షాప్ తనిఖీ కోసం మా ఉన్నత అధికారి వస్తున్నారు. మీ ఫైల్స్ అన్నీ సిద్ధం చేసుకోండి.. లేకుంటే రూ.లక్షల్లో ఫైన్ పడుతుంది' అని బెదిరింపులకు గురి చేశారు. అనంతరం తనిఖీలకు రాకూడదంటే ఫార్మాలిటీస్ చూసుకుంటే మంచిదంటూ నమ్మబలికారు. దీంతో ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు కదా.. ఎందుకొచ్చిందిలే అని కొంతమంది వ్యాపారులు సదరు వ్యక్తులు చెప్పినట్టు చేస్తామని చెప్పారు. ఇదే అదునుగా భావించిన సైబర్ నేరగాళ్లు వెంటనే వ్యాపారులకు ఒక ఫోన్ నెంబర్ ఇచ్చి డబ్బు పంపించాలని డిమాండ్ చేశారు. దీంతో సంబంధిత వ్యాపారి వెనువెంటనే రూ.20 వేలు ఫోన్ పే చేశాడు. ఇలా ఒకరికి తెలియకుండా మరొకరితో ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులమంటూ రూ.కోటిపైనే వసూళ్లకు పాల్పడ్డారు. చివరకు ఓ బెల్లం వ్యాపారి వద్ద వీరి ఆటకు అడ్డుకట్ట పడింది. సదరు బెల్లం వ్యాపారికి ఫోన్ చేసిన యథావిధిగా బెదిరింపులకు దిగారు. అయితే ఇన్‌కమ్ ట్యాక్స్ వివరాల గురించి పూర్తి స్థాయిలో ముందుగానే తెలుసుకున్న సదరు వ్యాపారి సైబర్ నేరగాళ్లని గుర్తించి 'మీ మాయమాటలు నా దగ్గర కాదని.. ఎవరిని పంపిస్తారో పంచుకోండని' ఫోన్ పెట్టేశాడు.

ఎంఈవో-2 పోస్టులు రద్దు చేయకండి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 16: మండల విద్యాశాఖాధికారి-2 పోస్టులు రద్దు చేసి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌కు అధికారాలు బదలాయించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌వీ కృష్ణారెడ్డి, ఎస్.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల విధులతోనే సతమతమవుతున్నారని, మండల పరిషత్ పాఠశాలలపై అధికారాలు కల్పిస్తే రెండింటికి న్యాయం చేయలేరని, విద్యావ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యాశాఖలో దాదాపు 95 శాతం ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో ఏర్పడిన ఎంఈవో-2 పోస్టును రద్దు చేస్తే ఉపాధ్యాయులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఎంఈవో-2 రద్దు ఆలోచనను విరమించుకుని అత్యధిక శాతం ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల మనోభావాలకు అనుగుణంగా తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

మండల విద్యాధికారి వ్యవస్థను కొనసాగించాలి : డీటీఎఫ్

నూతన జాతీయ విద్యావిధానం-2020లో అమలులో భాగంగా పాఠశాల సముదాయం బలోపేతం పేరిట మండల విద్యాధికారాలను కత్తెరించి స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టార్లకు, క్లస్టర్లకు సెకండరీ గ్రేడ్ టీచర్లను నియమించడాన్ని డీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం ఏసేపు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 117 వలన ప్రాథమిక విద్య దెబ్బతింటుందన్నారు. మండలంలో పాఠశాల విద్యను అజామాయిషీ చేస్తున్న మండల విద్యాశాఖ అధికారాలను పూర్తిగా తొలగించడానికి కుట్రలో భాగమే స్కూల్ కాంప్లెక్స్ కుదింపు చర్యలు ప్రభుత్వం చేపడుతుందన్నారు. దీనిని వెంటనే విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం విరాళాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు బజారప్ప, రాఘవేంద్రరావు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

నంద్యాల క్రైం, సెప్టెంబరు 16: నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగపేటలో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. చాపిరేవుల హైస్కూల్‌లో ఇంగ్లీష్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రమీళ రెండ్రోజుల క్రితం తన సోదరికి అనారోగ్యంగా ఉండటంతో పాణ్యం వెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 9తులాల బంగారు నగలు, అర కేజీ వెండి, రూ.20వేల నగదు అపహరించుకు పోయారు. సోమవారం ఇంటికి వచ్చిన ప్రమీళ ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. చోరీ జరిగిన తీరును పోలీసులు పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ నర్సింగ్ విద్యార్థిని మృతి

బేతంచెర్ల, సెప్టెంబరు 16: మండలంలోని సిమెంటు నగర్‌కు చెందిన నర్సింగ్ విద్యార్థిని షేక్ రుక్సానా (19) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సిమెంటు నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా, ఫాతిమా దంపతుల కుమార్తె షేక్ రుక్సానా కడప జిల్లా అయ్యవారిరెడ్డి నర్సింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం నర్సింగ్ కోర్సు చేస్తోంది. రుక్సానాను కళాశాలలో ఫోన్ మాట్లాడవద్దని యాజమాన్యం మందలించడంతోపాటు నెల రోజులపాటు సస్పెండ్ చేయడంతో ఇంటికి వచ్చింది. మనస్తాపానికి గురైన రుక్సానా ఈ నెల 13న ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

డోన్‌లో ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం



ఎస్పీ, ఎమ్మెల్యేలకు బొకేలు అందజేస్తున్న పోలీస్ అధికారులు

నంద్యాల క్రైం/ డోన్ రూరల్, సెప్టెంబరు 16 : నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ డోన్ పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు. రూల్స్ పాటించనివారిపై, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, డోన్ టౌన్ సీఐ ఇంతియాజ్ బాష, రూరల్ సీఐ సీఎం రాకేష్, ప్యాపిలి సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్సైలు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 16 : పట్టణంలోని సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం పక్కనే కుందూనది ఒడ్డున క్షుద్ర పూజల కలకలం రేగింది. సోమవారం కుందూ నది వద్ద క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. శనివారం, ఆదివారాలు సెలవు దినాలు కావడం, అటు వైపుగా ఎవరూ రాకపోవడంతో ఈ కార్యక్రమం జరిగి ఉండొచ్చని పలువురు పేర్కొంటున్నారు. క్షుద్రపూజల కోసం చేశారా, లేక దినకర్మ కోసం చేశారా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

నేడు నులి పురుగుల మందుల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 16: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం కింద మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలను మింగించనున్నట్లు డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు, బడి బయట పిల్లలకు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐల్లో మంగళవారం మధ్యాహ్నం భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఏదైనా కారణం చేత మాత్రలు అందని పిల్లలకు ఈ నెల 25న పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. పిల్లల్లో నులిపురుగులను నివారించడానికి, తద్వారా రక్తహీనతకు గురి కాకుండా ఈ మాత్రలు తోడ్పడతాయని తెలిపారు.

పెద్దాసుపత్రిలో 61 మంది క్షతగాత్రులకు చికిత్స

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 16: గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఆదివారం రాత్రి నుంచి గాయపడిన 61 మంది క్షతగాత్రులకు చికిత్స అందించినట్టు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గణేశ్ నిమజ్జనం రోజున ఆసుపత్రిలో ప్రత్యేకంగా ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేయడం వల్ల క్యాజువాల్టీలో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. గాయపడిన వారిలో చిన్న చిన్న గాయాలు వారే అధికంగా ఉన్నారని, కొందరికి ఫ్యాక్చర్లు కూడా అయ్యాయని తెలిపారు. వీరందరికీ క్యాజువాల్టీలోనే సత్వర వైద్యం అందించామన్నారు. ఆదివారం మధ్యాహ్నం రాత్రి డ్యూటీలో వైద్యులు, నర్సు లు బాగా పని చేశారని, అందు కోసం ప్రభుత్వ వై ద్యశాలలో ఉన్న నర్సులు, ప్రైవేటు వైద్యకళాశాలల్లో ఉన్న నర్సింగ్ విద్యార్థులు కూడా పని చేశారని ప్రశంసించారు. ఆసుపత్రిలో మొట్ట మొదటిసారిగా గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసి ర్యాపిడ్‌రెస్పాన్స్ టీమ్ సభ్యులు నర్సింగ్ సూపరింటెడెంట్ ఎస్‌పీ సావిత్రీబాయికి ప్రత్యేకంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గోనెగండ్ల, సెప్టెంబరు 16: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని బైలుప్పల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన చాకలి తిక్కన్న (35) తన ఇంటి దగ్గర ఉన్న మేకల పాకలో లైట్ వేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలోనే విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కోసిగి, సెప్టెంబరు 16: రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కోసిగి మండలంలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. రైల్వే పోలీసు సాయి సర్వేశ్వరరావు వివరాల ప్రకారం.. కోసిగి ఐరంగల్, ఆర్ఎస్ఎస్‌ల మధ్య 523/4042 నెంబరు సమీపంలో కోసిగి 2వ వార్డు బులొల్లి కాలనీకి చెందిన బలకుంద బంగారు కోసిగయ్య (52) గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మాదేవి, నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

ఆస్పరి, సెప్టెంబరు 16 : కారు బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. బెంగళూరుకు చెందిన ఒకే కుటుంబ సభ్యులు మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. మండలంలోని బిలేకల్ గ్రామ సమీపంలోకి రాగానే కారు సోమవారం మధ్యాహ్నం బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానిక రైతులు చూసి క్షతగాత్రులను ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

గ్రావెల్ తవ్వకాలపై విచారణ

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 16: గ్రావెల్ అక్రమ తవ్వకాలపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. సోమవారం కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు హాలహర్వి మండలం హర్ధగేరి వద్ద సర్వే నెంబర్ 104/సీ అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారించామని తెలిపారు. కస్తూర్బా స్కూల్ కోసం గ్రావెల్‌ను తరలించారని, మొత్తం 400 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలించినట్లు తేలిందని వివరించారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, మధు, సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

అధికారులకు కమిషనర్ అభినందనలు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 16: రెండు వారాలుగా గణేశ్ నిమజ్జన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు రాత్రింబవళ్లు శ్రమించిన నగర పాలక సంస్థ ఇంజనీర్లు, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులకు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులకు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సోమవారం అభినందనలు తెలిపారు. నగర పాలక అధికారులు అన్ని విభాగాలతో ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టడంతోనే నిమజ్జన కార్యక్రమం విజయవంతమైందని అన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 16: సీపీఎం, ఎస్‌డబ్ల్యూఎఫ్, సీఐటీయూ అధ్వర్యంలో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి సోమవారం నివాళి అర్పించారు. నగరంలోని పలు ప్రాంతాలలో సీతారాం ఏచూరి సంతాప సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ఏచూరి మృతి బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో ఖాజా పాష, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు పాల్గొన్నారు.

కల్లూరు: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి సీఐటీయూ , భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. సోమవారం శరీన్‌నగర్ మట్టిపని అడ్డా సమీపంలో ఆయన చిత్రపటాని కి ఆర్.నరసింహులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి విప్లవ నాయకుడు మృతి తీరని లోట న్నారు. కార్యక్రమంలో సుధాకరప్ప, జి.ఏసు కార్మికులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విరమించుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 16: రాష్ట్రంలో వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయడం మానుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు సోమవారం డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్ల కేటాయింపుపై గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓలు 107,108 నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రద్దు చేయడం తగదన్నారు. గుజరాత్ తరహాలో ప్రైవేటురంగానికి అప్పగించేందుకు ఈ ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్పు


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనులు చేస్తున్న మేస్త్రీ

ఓర్వకల్లు, సెప్టెంబరు 16: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సోమవారం ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్పునకు శ్రీకారం చుట్టారు. బ్రిటీష్ కాలం నాటి పద్ధతులను పూర్తిగా రద్దు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ప్రత్యేక పోడియాన్ని (ఎత్తు)ను తొలగించి, సబ్ రిజిస్ట్రార్ కుర్చీని, సాధారణ ఫ్లోరింగ్ ఎత్తులో ఉంచారు. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు తాగునీటితో పాటు కూర్చునేందుకు ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్ జయవాణి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

గల్లంతైన ఆర్మీ ఉద్యోగి మృతదేహం లభ్యం

కర్నూలు, సెప్టెంబరు 16: నగరంలో కేసీ కెనాల్‌లో గల్లంతైన ఆర్మీ ఉద్యోగి పవన్ కళ్యాణ్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. జమ్మూకాశ్మీర్‌లో ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ వినాయక చవితి సందర్భంగా సొంతూరైన కర్నూలు వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున స్నేహితులతో కలిసి స్వామిరెడ్డినగర్ వినాయకఘాట్ వద్దకు వెళ్లాడు. ఈత కొడుతుండగా.. ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఈయన మృతదేహాన్ని అయ్యప్పస్వామి టెంపుల్ వేనుక వైపు ఉన్న బ్రిడ్జి దగ్గర పోలీసులు గుర్తించారు. వెంటనే మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

శతక రచయితకు సత్కారం

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 16: కర్నూలుకు చెందిన శతక రచయిత డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డిని హైదరాబాదుకు చెందిన అనంతచ్ఛందం-పద్య రసమయి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. హైదరాబాదులోని సాగర్ రోడ్డులోగల అయ్యప్ప దేవాలయం సమావేశ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ చిన్నావుల వెంకటరాజారెడ్డి శ్రీకాంత శతకాన్ని రాసి ఈ వేదికగా ఆవిష్కరించారు. అనంతరం శతకంపై ప్రసంగించారు. అత్యుత్తమ శతక రచయితగా ఆయన్ను ఎంపిక చేసి ఈ కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు కంది శకరయ్య, అవధాని చక్రాల లక్ష్మీకాంతరాజారావు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి రగ్బీ మహిళా లీగ్ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 16: ఖేలో-ఇండియా ఆధ్వర్యంలో అక్టోబరు 20 నుంచి 22వ తేదీ వరకు రగ్బీ ప్రైజ్‌మనీ మహిళా లీగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఏపీ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు తెలిపారు. అండర్-15 బాలికలు, అండర్-18 బాలికలు, 18 ఏళ్లు పైబడిన కేటగిరీలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఒక్కో కేటగిరి విజేతలకు రూ.లక్ష చొప్పున మూడు కేటగిరీలకు రూ.3 లక్షల నగదు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోటీల వేదికను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

టీడీపీలోనే బీసీల అభివృద్ధి : ఎంపీ


బీసీ భవన్‌లో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 16: టీడీపీతోనే బీసీలు అభివృద్ధి చెందుతారని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. సోమవారం నగరంలోని బీసీ భవన్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. నాగేశ్వరావు యావద్‌తో కలిసి సందర్శించారు. నూతన బీసీ భవన్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ హయంలో బీసీ భవన్ నిర్మాణం కోసం స్థలం కేటాయించడంతో పాటు రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీ భవన నిర్మాణాన్ని వదిలేసిందని ఆరోపించారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చినందున బీసీ భవన్ నిర్మాణం చేపట్టడంతో పాటు పాత భవన మరమ్మతులకు తన వంతు సహాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నక్కల మిట్ట శ్రీనివాసులు, మురళీ మనోహర్, రామక్రిష్ణ, వెంపెంట రాంబాబు,కృష్ణాజీరావు, బాలసంజన్న, పీజీ వెంకటేశ్వర్లు,సరేష్, పవన్‌లు పాల్గొన్నారు.

వంతెన ఎత్తు పెంచాలి

ఓర్వకల్లు, సెప్టెంబరు 16: ఓర్వకల్లులోని జీవేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఈ వంతెన ఎత్తును పెంచాలని ప్రజలు కోరుతున్నారు. కుందూ వాగు జలాలు వంతెనపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బైరెడ్డి కాలనీవాసులు ఓర్వకల్లు గ్రామంలోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. వంతెన ఎత్తును పెంచాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.


వంతెన ప్రవహిస్తున్న నీరు

సాహితీ రంగంలో మహిళల పాత్ర పెరగాలి

క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 16: సాహితీ రంగంలో మహిళల పాత్ర పెరగాలని క్లస్టర్ యూనివర్సిటీ ఉప కులపతి డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. సోమవారం నగరంలోని మద్దూర్ నగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశం హాలులో, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం, తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ, స్నేహశ్రీ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తకాల ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం కర్నూలుకు చెందిన ప్రముఖ రచయిత్రి ఆరేపల్లి వరలక్ష్మమ్మ రాసిన 'శ్రీమద్దేవీ భాగవతం', 'రాజశేఖర చరిత్ర', 'దశ కుమార చరితము', 'పారిజాతాపహరణం' పుస్తకాలను జిల్లాకు చెందిన సాహితీవేత్తలతో కలిసి వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత్రి వరలక్ష్మమ్మ చదువుకున్నది ఎనిమిదో తరగతి వరకే అయినా, తొమ్మిది పదుల వయస్సులో చందస్సు నేర్చుకొని, వ్యాకరణ అధ్యయనం చేసి దాదాపు పాతిక పుస్తకాలు వెలువరించడం స్ఫూర్తిదాయకమని అన్నారు. గౌరవ డాక్టరేట్ పురస్కారం ప్రదానానికి ఆయన ప్రతిపాదన చేశారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సభలో విశిష్ట అతిథులుగా గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర, కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ పాల్గొన్నారు. కవులు డాక్టర్ వీపూరి వెంకటేశ్వర్లు, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, డాక్టర్ బోలుగద్దె అనిల్‌కుమార్, డాక్టర్ తొగట సురేష్‌బాబులు పుస్తకాలు సమీక్షించారు. అనంతరం కవయిత్రులు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, పసుపులేటి నీలిమ, హైమవతి, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, రజనీకల్కూర, లక్ష్మి సుశీలరాణి, మణికంఠ తదితరులు పుస్తక రచయిత్రి ఆరేపల్లి వరలక్ష్మమ్మను ఘనంగా సత్కరించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న క్లస్టర్ వర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, సాహితీవేత్తలు

విజయవాడ వరద బాధితులకు విరాళాలు

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు చెక్కుల అందజేత

కల్లూరు, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం ఆనందంగా ఉందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. పాణ్యం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి టీడీపీ నాయకులు సేకరించిన విరాళం చెక్కులను సోమవారం ఎమ్మెల్యేకు అందజేశారు.

- కల్లూరు మండలం బొల్లవరం గ్రామ టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, మస్తాన్‌నాయుడు వరద బాధితుల సహాయం కోసం విరాళాలను సేకరించారు. మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో గౌరు చరితకు రూ.47,340 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, కార్యకర్తలు జానకిరాముడు, మధు, ఎస్ఎంసీ చైర్మన్ మస్తాన్‌నాయుడు, లక్ష్మన్న ప్రసాద్‌గౌడ్ ఉన్నారు.
- కల్లూరు మండలం పుసులూరు గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు పుసులూరు ప్రభాకర్‌రెడ్డి రూ.1,23,456ల చెక్కును అందజేశారు.
- పెద్దటేకూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు యాగంటయ్య, జగన్నాథం రూ.26 వేల చెక్కును ఎమ్మెల్యే గౌరుచరితకు అందజేశారు.
- 29, 30 వార్డుల టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, పుల్లయ్యగౌడ్ వరద బాధితుల కోసం ఎమ్మెల్యే గౌరుచరితకు రూ.40 వేలు చెక్కు అందజేశారు.


గౌరుచరితకు వరద బాధితులకు విరాళం అందజేస్తున్న బొల్లవరం టీడీపీ నాయకులు

స్వచ్ఛతా హి సేవను విజయవంతం చేద్దాం

గూడూరు సెప్టెంబరు 16: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో విజయ సింహారెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం మంగళవారం నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్‌ల సహకారంతో నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో భాగంగా పరిసరాల శుభ్రతపై మానవహారాలు, స్వచ్ఛతా పరుగు, ర్యాలీ వంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు.

కల్లూరు: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుండి అక్టోబరు 1వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో సర్పంచుల సహకారంతో చేపట్టాలని సెక్రటరీలను ఆదేశించారు. స్థానిక ప్రజా ప్రతినిధులను బాగస్వామ్యం చేసుకొని, పరిసరాలు, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదిశగా సిబ్బంది పనిచేయాలని కోరారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

కర్నూలు,సెప్టెంబరు 6: మిలాద్- ఉన్- నబీ పండుగ సందర్భంగా టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ బాబు ప్రసాదు హాజరై మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారిని కాపాడేందుకు రక్తదాన శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. యువత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందిపై కేసు నమోదు

కర్నూలు, జనవరి 11: కర్నూలు నగర శివార్లలో సుంకేసుల రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పది మంది ద్విచక్ర వాహనదారులు, ఇద్దరు ఆటో డ్రైవర్లు పోలీసులు పట్టుకున్నారు. వీరి వాహనాలు సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మందుబాబులపై కేసు నమోదు చేసి నేడు కోర్టులో హాజరుపరుస్తామని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

నేడు విశ్వకర్మ జయంతి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 16: విశ్వకర్మ జయంతిని మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ, సాధికారిక అధికారి పి.వెంకటలక్ష్మమ్మ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు.

ఉరుకుందలో పూజలు



కౌతాళం, సెప్టెంబరు 16: ఉరుకుంద ఈరన్న ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలను చేపట్టారు. అర్చకులు మూలవిరాట్‌కు తెల్లవారు జామునే శుద్దజలంతో పూజించి ప్రత్యేక పుష్పాలతో ఆలంకరించి మహమంగళహారతితో పూజించి భక్తులకు దర్శనం కల్పించారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకోగా మరి కొంత మంది భక్తులు స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో
జిల్లా జట్టుకు మూడో స్థానం


ట్రోఫీ అందుకుంటున్న జిల్లా యోగా క్రీడాకారులు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 16: యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 15 వరకు విశాఖపట్నం భీమిలిలో జరిగిన 49వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో 149 పాయింట్లతో కర్నూలు జిల్లా మూడో స్థానం సాధించినట్లు రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి తెలిపారు. వ్యక్తిగత విభాగాల్లో పతకాలు సాధించిన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి. 8 నుంచి 10 సంవత్సరాల బాయ్స్ విభాగంలో సాకేత్ (రెండో స్థానం), బాలికల విభాగంలో రేహా వినూత్న రెడ్డి (మొదటి స్థానం), 10 నుంచి 12 విభాగం బాలురలో మొహ్మద్ అవహాస్ (3వ స్థానం), సాకేత్ (నాల్గవ స్థానం), బాలికల విభాగంలో మనుశ్రీ (మొదటి స్థానం), కృష్ణప్రియ (3వ స్థానం), 12-14 విభాగం బాలురలో లిఖిత్ (3వ స్థానం) సందీప్ (6వ స్థానం) 14 నుంచి 16 విభాగంలో ధనుంజయ చౌదరి (6వ స్థానం), బాలికల విభాగంలో మనస్విని (6వ స్థానం) 16 నుంచి 18 బాలికల విభాగంలో పల్లవి (మొదటి స్థానం), ప్రొఫెషనల్ కేటగిరిలో మునిస్వామి (మూడో స్థానం) వీరంతా అక్టోబరు 24 నుంచి 27 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు అర్హత సాధించారన్నారు.

ఘనంగా సంజమ్మవ్వ ఆరాధన

ఓర్వకల్లు, సెప్టెంబరు 16: మండలంలోని నన్నూరు గ్రామంలో సోమవారం సంజమ్మవ్వ ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించారు. సంజమ్మవ్వ సమాధి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండలంలోని నన్నూరు, పూడిచెర్ల, భైరాపురం, లొద్దిపల్లె తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

సి. బెళగల్, సెప్టెంబరు 16: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళపై దాడి చేసిన వారిని శిక్షించాలని దళిత, అవాజ్ సంఘం నాయకుడు, శేషు, నాగరాజు, గఫూర్, రఫి డిమాండ్ చేశారు. సోమవారం సిబెళగల్‌లో మాట్లాడుతూ దాడిని ఖండిస్తున్నామన్నారు. ఇటీవల దళితలపై దాడులు అధికమయ్యాయని, దాడులను ప్రభుత్వం అరికట్టాలని వారు కోరారు.. ఈసమావేశంలో దళిత, అవాజ్ కమిటీ నాయకులు గఫూర్, రఫి, బీమన్న, రంగన్న రాముడు తదితరులు ఉన్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు

- నిధుల కొరతతో నిలిచిన పనులు

గూడూరు, సెప్టెంబరు 16: గూడూరులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దాదాపు రూ.15 లక్షల నిధులతో ప్రభుత్వ విశ్రాంతి(విడిది) భవనం పనులు చేపట్టారు. నిధుల కొరత కారణంగా భవన నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. భవన నిర్మాణ పనులు నిలిచిపోయి ఇరవై ఏళ్లు దాటినా ఎవరికీ పట్టడం లేదు. నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలనే ఆలోచన అటు అధికారులకు గాని, ఇటు పాలకులకు గాని రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ ఆవరణలోనే తహసీల్దార్ కార్యాలయం భవనం శిథిలమైపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి నిధులు మంజూరు చేయించి ప్రభుత్వ విశ్రాంతి భవన నిర్మాణ పనులు పూర్తి చేయించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.


పశువులకు అవాసంగా మారిన ప్రభుత్వ విశ్రాంతి భవనం

స్వచ్ఛతా హి సేవలో భాగస్వామ్య కావాలి

● కమిషనర్ పీవీ రామలింగేశ్వర్



కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 16: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో నేటి నుంచి వచ్చే నెల ఒకటి వరకు నగరంలో స్వచ్ఛతా హీ సేవా పేరుతో రోజుకొక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పివి. రామలింగేశ్వర్ తెలిపారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు నగర పాలక అధికారులు, సిబ్బంది, సచివాయ కార్యదర్శులతో కలిసి కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తామని అన్నారు. పరిశుభ్రమైన దేశం-సురక్షిత ప్రజారోగ్యం కోసం నగరపాకలతో కలిసి స్వచ్ఛ హీ సేవా కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. అక్టోబర్ 1 నుంచి ప్రతి రోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించామన్నారు. అక్టోబర్ 2న నగర పాలక కౌన్సిల్ హాలులో స్వచ్ఛ భారత్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపాలి : సీఐటీయూ

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 16: జిల్లాలోని వివిద గ్రామాలలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక కర్షక భవన్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజునాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజకీయ జోక్యం వల్ల ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ఇప్పటికే 25 మందిని బలవంతంగా రాజీనామాలు చేయించారని అన్నారు. మరొక 75 మందికి పని విధానం సరిగ్గాలేదని నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. సమస్యలను పరిష్కారించాలని 20న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

- వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని ఆవాజ్ కమిటీ మతసామరస్యం చాటిందని కమిటీ నగర కార్యదర్శి షరీఫ్ తెలిపారు. నిమజ్జనం సందర్భంగా కమిటీ అధ్వర్యంలో పాతబస్తీ నుంచి వినాయక ఘాట్ వరకు మంచినీళ్ల ప్యాకెట్లు సరఫరా చేయడం జరిగిందన్నారు.

మహమ్మద్ ప్రవక్త గొప్ప సంస్కర్త


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 16: మహమ్మద్ ప్రవక్త గొప్ప సంస్కర్త అని కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా జిల్లా మైనార్టీ సెల్ మాజీ చైర్మన్ మహమ్మద్ నూర్ అధ్యక్షతన సిటీ మైనార్టీ సెల్ మాజీ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, సయ్యద్ ముర్షిద్ పీర్ ఖాద్రీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త కాలగతిని మార్చిన శూరుడని, మూఢ జనాన్ని మహా జ్ఞానులుగా మార్చగలిగిన అద్వితీయ సంస్కర్త అని కొనియాడారు. ముస్లిం పెద్దలందరికీ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, అనంత రత్నం మాదిగ, అబ్దుల్ లతీఫ్, లాజరస్, బజారన్న, తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో కార్డియాలజిస్టులది కీలకపాత్ర

ప్రొఫెసర్ డాక్టర్ పి.చంద్రశేఖర్


మాట్లాడుతున్న డాక్టర్ పి.చంద్రశేఖర్

కర్నూలు(హస్పటల్), సెప్టెంబరు 16: వైద్య రంగంలో కార్డియాలజిస్టులది కీలకపాత్ర అని కర్నూలు ప్రభుత్వ వైద్యశాల కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్ డా.పి.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆసుపత్రిలోని కార్డియాలజీ కాన్ఫరెన్సు హాలులో అంతర్జాతీయ ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డా.చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్డియాలజీ రంగంలో వైద్యులు చేసిన యాంజియోప్లాస్ట్, స్టెంటింగ్ పేస్‌మేకర్ వంటి విధానాలు రోగుల ప్రాణాలను రక్షించేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. కర్నూలు జీజీహెచ్‌లో కొత్త క్యాథ్‌లాబ్‌లో 2023 నవంబరు 22 నుంచి ఇప్పటి వరకు కరోనానీ యాంజియోగ్రామ్(సీఏజీ) 796, కరోనరీ యాంజియో ప్లాస్టీ(పీటీసీఏ) స్టంట్స్-281, తాత్కాలిక మేస్‌మేకర్స్ ఇన్‌సర్షన్ 15, శాశ్వత పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్-2, కిడ్నీ యాంజియోప్లాస్టి-2 చేశామన్నారు. గుండె వ్యాధులకు మెరుగైన చికిత్స అందించేందుకు కార్డియాలజీ వైద్యులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.ప్రశాంత్, డా.కిరణ్‌కుమార్ రెడ్డి, డా.ఉదయ్‌బిందు, డా.రవికిరణ్, పీజీ వైద్య విద్యార్థులు సత్యకుమార్, మహేష్, టి.శ్రీకాంత్, పర్వేజ్‌నవాబ్, తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్ బోర్డు చట్టాల సవరణతో ప్రజలకు మేలు'


మాట్లాడుతున్న నగరూరు రాఘవేంద్ర

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 16: వక్ఫ్‌బోర్డు చట్టాల సవరణతో ప్రజలకు మేలు జరగుతుందని, ప్రజలకు అనుకూలమైన సంస్కరణలను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. సోమవారం నగరంలోని 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు బిల్లులోని 40 సవరణలకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని, పార్లమెంటులో వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ప్రవేశ పెట్టారని అన్నారు. సవరణలతో వక్ఫ్‌బోర్డు తన ఆస్తులను జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, ఆదాయాలను తనిఖీ చేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. వక్ఫ్ బోర్డులో మహిళలకు భాగస్వామ్యం ఉంటుందన్నారు. అలాగే వివాదాస్పద, పాత ఆస్తులను కొత్తగా ధ్రువీకరించుకోవచ్చని, అందువల్ల వక్ఫ్‌బోర్డు క్లెయిమ్‌లన్నింటికీ పారదర్శకత ఉంటుందని అన్నారు. సమావేశంలో బీజేపీ స్థానిక నాయకులు శివయ్యశెట్టి, రామాంజినేయులు, గోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనంలో అపశృతి
ట్రాక్టర్ పై నుంచి పడి వ్యక్తి మృతి

కర్నూలు, సెప్టెంబరు 16: నగరంలో గణేశ్ నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. ట్రాక్టర్‌పై నుంచి కింద పడి కృష్ణ (49) అనే వ్యక్తి మృతి చెందాడు. పాతబస్తి బండిమెట్టకు చెందిన కృష్ణ ఆటో నడుపుకుంటూ జీవనం చేస్తుంటాడు. నిమజ్జనం సందర్భంగా సమీపంలో ఉన్న వినాయక విగ్రహ నిర్వహకులతో పాటు కృష్ణ నిమజ్జనానికి వెళ్లాడు. తిరిగి నిమజ్జనం చేసి వస్తుండగా.. కొండారెడ్డి బురుజు వద్ద ట్రాక్టర్ పై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో ఆయనను చికిత్స నిమ్మితం ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈకేవైసీ గడువు పొడిగింపు

మద్దికెర, సెప్టెంబరు 16: పంటల నమోదుకు ఈకేవైసీ గడువును 30వ తేదీ వరకు పొడిగించినట్లు ఏవో రవి సోమవారం తెలిపారు. మండలంలో 21వేల ఎకరాలుండగా, 486 ఎకరాలకు మాత్రమే ఈకేవైసీ చేయలేదని, నమోదు చేయించుకోవాలని రైతులను కోరారు.

క్రీడాకారుడికి వీరభద్ర గౌడ్ చేయూత

ఆలూరు, సెప్టెంబరు 16: ఆంధ్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారుడు మధుకు టీడీపీ నాయకుడు వీరభద్ర గౌడ్ సోమవారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈనెల 18న ఆసియాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటున్నందున క్రీడాకారుడిని అభినందించారు. వన్నూర్ వల్లి, కొమ్ము రాజు, హనుమప్ప, రాము, యాదవ్, బీజేపీ మండల కన్వీనర్ బసరాజు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

నందవరం, సెప్టెంబరు 16: అనారోగ్యంతో బాధపడుతున్న మంగళి నరేష్‌కు సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సోమవారం పంపిణీ చేశారు. చికిత్సకు డబ్బులు లేక బాధితుడు ఎమ్మెల్యేను ఆశ్రయించాడు. ఎమ్మెల్యే సూచన మేరకు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. గోవర్ధనరెడ్డి, సోమలగూడురు చంద్ర, మాజీ ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, గజేంద్రరెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం ట్రై సైకిళ్లు సిద్ధం



పంపిణీకి సిద్ధంగా ఉన్న ట్రై సైకిళ్లు

హొళగుంద, సెప్టెంబరు 16: స్థానిక కార్యాలయంలో దివ్యాంగుల కోసం ట్రైసైకిళ్లు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీడీవో సుహాసినమ్మ, నీతి ఆయోగ్ సమన్వయకర్త రవిశంకర్ సోమవారం తెలిపారు. మోటర్ సైకిల్లు 16, వీల్ ఛైర్‌లు13, ట్రై సైకిల్ 47 వచ్చినట్లు తెలిపారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, తీసురావాలని తెలిపారు. కార్యదర్శులు రాజశేఖర్, రంగస్వామి, మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.

గుండె పోటుతో రైతు మృతి



హుశేనీ (ఫైల్)

కోసిగి, సెప్టెంబరు 16: మండలంలోని సజ్జలగుడ్డం గ్రామం రైతు హరిజన హుశేనీ (49) గుండెపోటుతో మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మీ తెలిపిన వివరాల మేరకు.. వ్యవసాయంలో నష్టం రావడంతో సుమారు రూ.2 లక్షల అప్పు అయింది. అప్పులు ఎలా తీర్చాలని మదనపడే వాడు. సోమవారం ఉదయం అప్పు విషయమై ఇంట్లో మాట్లాడుతూ గుండె నొప్పి వచ్చింది. కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ప్రజల దాహార్తి తీర్చడానికి కొళాయిలు



కడమకుంట్లలో కొళాయి ప్రారంభిస్తున్న సర్పంచ్ మస్తానమ్మ

తుగ్గలి, సెప్టెంబరు 16: ప్రజల దాహార్తి తీర్చడానికి కొళాయిలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ మస్తానమ్మ, పంచాయతీ సలహాదారుడు సీపీఐ కార్యదర్శి సుల్తాన్ అన్నారు. సోమవారం కడమకుంట్లలో జల్‌జీవన్ మిషన్ కింద కొట్టాల కాలనీ నుంచి మసీదు వరకు ఇంటింటికీ వేసిన కొళాయిలను ప్రారంభించారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో పంచాయతీని అభివృద్ధి చేస్తామన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు వెంకటేశ్వర్లు, హనుమంతు, సుధాకర్, కాశీంవలి, టీడీపీ నాయకులు సుధాకర్, బండయ్య తదితరులు ఉన్నారు.

తెర్నేకల్‌లో హోమియోపతి వైద్య శిబిరం

దేవనకొండ, సెప్టెంబరు 16: మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో ఉప్పర కాలనీలో హోమియో వైద్యులు సోమశేఖర్ గ్రామానికి చెందిన దాదాపు మూడువందల మందికి ఉచితంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా జ్వరాలకు హోమియో మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ అరుణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు నామాల శ్రీనివాసులు, గడ్డం నాగరాజు, నాగభూషణం, కట్టమీద వెంకటేష్ పాల్గొన్నారు.

నీట్ పరీక్షల్లో ప్రతిభ చాటిన రమ్యశ్రీ



హొళగుంద, సెప్టెంబరు 16: మండలంలోని ఎల్లార్తి గ్రామానికి చెందిన మాల రమ్యశ్రీ నీట్ పరీక్షల్లో ప్రతిభ చాటినట్లు తల్లిదండ్రులు మాల ఈరన్న, శేఖమ్మ సోమవారం తెలిపారు. 770 మార్కులకు గానూ 536 మార్కులు సాధించింది. స్టేట్ ర్యాంక్ 5540, ఆల్ ఇండియా ర్యాంక్ 1,55,268 సాధించినట్లు తెలిపారు. తిరుపతిలోని పద్మావతి మెడికల్ కాలేజిలో కౌన్సెలింగ్ కోసం వెళ్లినట్లు తెలిపారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 16: పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, సాయి గణేష్ కాలనీల్లో రెండు రోజులు తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి సోమవారం తెలిపారు. పైపులైన్ల మరమ్మతుల పనులు చేస్తున్నామని ఈ కారణంగా అంతరాయం ఏర్పడిందని, పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

20న జాబ్ మేళా

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 16: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారులు సోమవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఉద్యోగాలు ఇచ్చేందుకు వివిధ కంపెనీల ప్రతినిధులు వస్తున్నారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ పాస్ అయిన నిరుద్యోగులు, వయస్సు 18-30 సంవత్సరాలలోపు ఉన్నవారు హాజరు కావాలన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు తగిన ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

సొమ్ము ఇచ్చుకో... బంకు వేసుకో!



అరికెర రోడ్డులో ప్రభుత్వ స్థలంలో బంకులు

- ఆలూరులో ఇష్టారాజ్యంగా బంకులు

పట్టణంలో ఖాళీగా ప్రభుత్వ స్థలం కనిపించిందా.. ఇక అంతే! రాత్రికి రాత్రే బంకులు వెలుస్తున్నాయి. ఇదేదో నిరుద్యోగులు ఉపాధి కోసం వేసుకున్నవైతే కాదు. రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం వెలసిన బంకులు.

ఆలూరు, సెప్టెంబరు 16: పట్టణంలోని అరికెర రోడ్డు నుంచి ప్రగతి స్కూల్ వరకు ఖాళీ స్థలాల్లో అడ్డ గోలుగా బంకులు వెలిశాయి. ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ, జూనియర్ కళా శాల, ఎస్సీ బాలికల హాస్టల్, విద్యుత్ శాఖ కార్యాలయం ఇలా ఏదీ వదల్లేదు.

రాజకీయ నాయకుల హస్తం...

ఈ బంకుల వ్యవహారంలో రాజకీయ నాయకుల హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. చోటా మోటా నాయకులు తమ నాయకుని అండదండలతో ఇలా పబ్బం గడుపుకుంటున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

పట్టణంలో ఇష్టారాజ్యంగా బంకులు వెలుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీకి నామమాత్రంగా పన్నులు వసూలు చేస్తూ ఏమీ తెలియనట్లు ఉంటున్నారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు

రాజకీయ నకుల అండ ఉండటంతో అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలు స్తోంది. ఇటీవల ఓ ప్రజా ప్రతినిధి సోదరుడు రూ.70వేలు ఇవ్వా లని ఒత్తిడి చేసినట్లు ఓ చిరువ్యాపారి ఆవేదన వ్యక్తం చేశాడు. జేసీ ఆదేశాల మేరకు నెల క్రితం కేడీసీఎంఎస్ గోదాం వద్ద వేసిన బంకులను అధికారులు తొలగించారు. అయితే మిగతా చోట్ల ఎందుకు తొలగించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెండేళ్ల క్రితం బంకులను తొలగించాలని నిర్వాహకులకు పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమార్ నోటీసులు జారీచేశారు. అయితే రాజకీయ ఒత్తిళ్లు రావడంతో వెనక్కి తగ్గినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది

అరికెర రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. రహదారికి ఇరువైపులా బంక్‌లు ఉండటంతో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు తీవ్ర తరమవుతోంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మా పరిధిలో లేదు

బంకుల తొలగింపు మా పరిధిలో లేదు. వాటిని తొలగించాల్సిన బాధ్యత ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖలు చూసుకోవాలి. త్వరలో రోడ్డు విస్తరణ చేయనున్నాను, అప్పుడు బంకులు తొలగించాల్సిందే. **- ప్రకాష్ నాయుడు, ఇన్‌చార్జి కార్యదర్శి, ఆలూరు గ్రామ పంచాయతీ**

మహిళపై వైసీపీ నాయకుల దాడి

- పోలీసులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేకు బాధితురాలి ఫిర్యాదు
- స్పందించిన ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, సెప్టెంబరు 16: ఆదోని పట్టణంలోని మరాఠిగేరిలో నివాసముంటున్న రాజేశ్వరి అనే మహిళ తనపై వైసీపీ నాయకులు దాడి చేసినట్లు ఎమ్మెల్యే పార్థసారథిని సోమవారం ఆశ్రయించింది. స్పందించిన ఎమ్మెల్యే పార్థసారథి మరాఠిగేరిలోని రాజేశ్వరి నివాసానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. తమ ఇంటి వద్ద ఉన్న విద్యుత్ స్తంభం విషయంలో వైసీపీ నాయకులు దుర్భాషలాడి, దాడి చేశారని ఎమ్మెల్యే వద్ద కన్నీటి పర్యంతమైంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోవడం లేదని వాపోయింది. స్పందించిన ఎమ్మెల్యే ఆదోని నియోజకవర్గంలో ఏ మహిళపై దాడి చేసినా వైసీపీ నాయకుల నాలుక చీరేస్తానని హెచ్చరించారు. అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించేందుకు కూడా వెనుకాడబోనని హెచ్చరించారు. పోలీసులకు చెప్తానని తిరిగి కలవాలని బాధితురాలికి ఎమ్మెల్యే సూచించారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణపై పోరాడుదాం



నిరసన తెలుపుతున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 16: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడదామని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బాలరాజు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణం లోని సోమప్ప సర్కిల్‌లో నిరసన తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకునేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా కాపాడుకుందామని అన్నారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో 32 మంది ప్రాణత్యాగంతో ఉక్కు పరిశ్రమ ఎర్పడిదని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న, బాబు, చంద్రగౌడ్, రామదాసు పాల్గొన్నారు.

దాడికి గురైన మహిళకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న చేయూత నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 16: పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దాడికి గురై ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు గోవిందమ్మకు చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యుడు ప్రసన్న రాజు సోమవారం ఆర్థికసాయం చేశారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, నేటికీ గ్రామాలు, పట్టణాల్లో దళితుల పట్ల అంటరానితనం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేయూత సంస్థ తరపున రూ30,000, అంబేడ్కర్ యూత్ రూ6,500 కలిపి మొత్తం రూ.36, 500 అందించామని తెలిపారు. మాదన్న, భాస్కర్, అడివన్న, ప్రకాష్, వినోద్, రంగస్వామి పాల్గొన్నారు.

కోసిగి: దళిత మహిళపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు దుర్గప్ప, నాగరాజు, సామేల్ డిమాండ్ చేశారు. కలెక్టర్, ఎస్పీ చొరవ తీసుకుని దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నరసింహులు, ఉరుకుంద, చిన్నమారెన్న, అంజి ఉన్నారు.

పెద్దకడుబూరు: దళిత మహిళ గోవిందమ్మపై దాడి దారుణమని టీడీపి ఎస్సీ సెల్ నాయకులు యేసేబు, విజయ్ అన్నారు. సోమవారం ఎమ్మిగనూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో వారు గోవిందమ్మను పరామర్శించారు.

వైసీపీ నాయకులవి మతిస్థిమితం లేని మాటలు



చెరువులో నీటిని చూపుతున్న టీడీపీ నాయకులు

నందవరం, సెప్టెంబరు 16: మండలంలోని మాచాపురం వైసీపీ నాయకులు మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని టీడీపీ నాయకుడు మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు దేవ సహాయం అన్నారు. సోమవారం గురురాఘవేంద్ర చెరువులోని నీటి నిల్వను పరిశీలించారు. చెరువు నిండా నీళ్లు ఉంటే చెరువులో నీళ్లు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పడం చూస్తుంటే వారికి మతిస్థిమితం లేదని తెలిసిపోయిందని ఎద్దేవా చేశారు. చెరువులో నీళ్లు లేకపోతే 1,200 ఎకరాల్లో వరి ఎలా సాగు చేస్తారని ప్రశ్నించారు. 2022, 2023లో చెరువులో నీళ్లలేక ఇబ్బంది పడుతున్నప్పుడు అధికారంలో ఉన్న మీరు ఎక్కడికి వెళ్లారని అప్పుడు రైతులు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, మాచాపురం మాజీ సర్పంచ్ కాశీంవలీ, బడేసాబ్ వలి చొరవతో ప్రస్తుతం చెరువుకు నీళ్లు వచ్చాయని గుర్తు చేశారు. తేజశ్వరనాయుడు, సుభాష్, రత్నం, చిన్నరాజు, భూపతి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ఉద్యోగులు జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 16: ఉద్యోగ ఉపాధ్యాయులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు సూచించారు. సోమవారం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ ఆదోని డివిజన్ శాఖ ఆధ్వర్యంలో మధు హాస్పటల్ సౌజ న్యంతో ఉపాధ్యాయులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పనిఒత్తిడితో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఉచితంగా గుండె, ఎముకలు, కంటి సంబంధిత వ్యాధుల పై వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 150 మంది ఉద్యోగ ఉపాధ్యాయులు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. రమేష్ నాయుడు, వీరచంద్రయాదవ్; మహాదేవప్ప, సుంకన్న, రామకృష్ణ, సుధాకర్ బాబు, భీమ్‌రాజు, వైద్యుడు విశ్వనాథ్, హెచ్‌ఎం మల్లికార్జున పాల్గొన్నారు.

సీముల్లంగన మహోత్సవం

మంత్రాలయం, సెప్టెంబరు 16: మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఈ నెల 18న చాతుర్మాసదీక్షలకు ముగింపు పలకనున్నారు. గత నెల ఆగస్టు 2వ తేదీ నుంచి ఈ నెల 18వ వరకు మంత్రాలయం సరిహద్దులు దాటకుండా తన 12వ చాతుర్మాస దీక్షను చేపట్టిన విషయం తెలిసిందే. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల సీముల్లంగన మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం మఠం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. రాఘవేంద్ర సర్కిల్ నుంచి పంచవాహన రథంపై ఊరేగింపు నిర్వహించి మఠం ప్రాంగణంలో పీఠాధిపతిని సన్మానించనున్నారు. తన 12వ చాతుర్మాస దీక్షలు విజయవంతంగా ముగియడంతో భజన మండళ్లు, ఉద్యోగులు సంబరాలు చేసుకుంటారు. అనంతరం పీఠాధిపతులు తన ఉపన్యాసాన్ని ప్రసంగిస్తారు.

ఉరుకుందలో పూజలు

కౌతాళం, సెప్టెంబరు 16: ఉరుకుంద ఈరన్న ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలను చేపట్టారు. అర్చకులు మూలవిరాట్‌కు తెల్లవారు జామునే శుద్ధ జలంతో పూజించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మహా మంగళ హారతితో పూజించి భక్తులకు దర్శనం కల్పించారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకోగా మరి కొంత మంది భక్తులు స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

నేడు జ్యోతుల ఉత్సవం

పత్తికొండ, సెప్టెంబరు 16: చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం నేడు మంగళవారం నిర్వహించనున్నట్లు ర్వాహకులు తెలిపారు. పొద్దుటూరు భక్తులు జ్యోతులను మోస్తూ ముందుకుసాగుతారన్నారు. తెల్లవారుజామున ప్రారంభ మయ్యే ఉత్సవం ఉదయం వరకు సాగుతుందన్నారు.

కల్లుకుంట గ్రామాన్ని సందర్శించిన తహసీల్దార్



గ్రామంలో విచారణ చేస్తున్న తహసీల్దార్

పెద్దకడుబూరు, సెప్టెంబరు16: మండలంలోని కల్లుకుంట గ్రామాన్ని తహసీల్దార్ శ్రీనాథ్ సోమవారం సందర్శించారు. నాలుగు రోజుల క్రితం గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి, పోలీసుల పికెటింగ్ వివరాలను తెలుసుకున్నారు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, డీటీ మహేష్, ఆర్ఐ మహేష్, ఏఎస్ఐ శివరాము పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

మంత్రాలయం, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మల్లెల గ్రూప్స్ ఆధ్వర్యంలో నిత్యవసరాలు సిద్ధం చేశారు. గోపినాథ్, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

ఉచ్చీరప్ప తాతకు పూజలు

ఆలూరు రూరల్, సెప్టెంబరు 16: మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో వెలసిన ఉచ్చీరప్ప తాత ఆలయంలో విశేష పూజలను పీఠాధిపతి చంద్రమౌళి, సిద్దయ్యస్వామి చేశారు. కమ్మ సంఘం ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించి రూ.లక్ష విలువ చేసే వివిధ రకాల పూలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కమ్మసంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివారికి మొక్కుబడులు సమర్పించారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న కమ్మ సంఘ సభ్యులు

ఎస్టీ జాబితాలో చేర్చాలి



కోసిగిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కోసిగి, సెప్టెంబరు 16: వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్చాలనీ ఏపీ వాల్మీకి బోయ సంఘం ఏపీవీబీఎస్ జిల్లా అధ్యక్షుడు వాల్మీకి అర్జున్ తెలిపారు. సోమవారం కోసిగిలో వాల్మీకి నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 22న ఆదివారం కర్నూలు జడ్పీ హాలులో ఏపీవీబీఎస్ ఆధ్వర్యంలో వాల్మీకి, బోయల ఎస్టీ సంఘం రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రాలయం నియోజకవర్గంలోని గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 22న వర్క్‌షాపునకు వాల్మీకులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. జ్ఞానేష్, వీరేష్, తాయన్న వీరారెడ్డి, అయ్యప్ప పాల్గొన్నారు.

కౌతాళం: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సమితి (ఏపీవీబీఎస్) జిల్లా అధ్యక్షుడు వాల్మీకి అర్జున్ డిమాండ్ చేశారు. మండలంలో సోమవారం ఏపీవిబిఎస్ ఆధ్వర్యంలో ఎస్టీ సాధన కోసం ఈ నెల 22న కర్నూలులో సమావేశం నిర్వహించను న్నామని జయప్రదం చేయాలని కోరారు. ముందుగా వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో చేరిస్తేనే తమ పిల్లల భవిష్యత్తు బంగారుమయంగా ఉంటుందన్నారు. ఈ నెల 22న కర్నూలులో నిర్వహించనున్న సమావేశానికి వాల్మీకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. నక్రి తిక్కయ్య, కాత్రికి చంద్ర, ఉరుకుంద మహదేవ, చిరంజీవి, నరసయ్య, ఎరిగేరి బసవరాజు, రామలింగ, ఉపేంద్ర పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

- పట్టణాల్లో ర్యాలీలు
- ముస్లింలకు అన్నదానం



ఆదోనిలో ముస్లింల ర్యాలీ



ప్రార్థనల్లో పాల్గొన్న ఉమాపతినాయుడు

ఆదోని, ఆదోని (అగ్రికల్చర్)/ హొళగుంద/ ఆస్పరి/ ఆలూరు, సెప్టెంబరు 16 :

ఆదోనిలో: మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పలు వీధులలో అన్నదానం చేసి, సామాజిక కార్యకర్త నూర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వీధులలో ర్యాలీ చేపట్టారు. సాయంత్రం ఖాజీపుర, హవాన్నపేట, కౌడల్‌పేట, ఖానిమొహల్లా, సయ్యద్ పేట ప్రాంతాలలో ప్రార్థనా కార్యక్రమాలు చేపట్టారు.

బార్ పేటలో ప్రవక్త మహమ్మద్ తలనీలాలను ఉమాపతి నాయుడు దర్శించుకున్నారు. నాయకులు కేఎండీ అల్తాఫ్ హుస్సేన్, రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు, ఆరిఫ్ బాషా, జిల్లా మైనారిటీ సెల్ కార్యదర్శి, ఇంతియాజ్, జాఫ్ఫార్, ఎస్వీఆర్ చాంద్, మన్సూర్, సాదుల్లాహ్, బండిబాషా, అఫ్సర్ పాల్గొన్నారు.

హొళగుదలోని షాలి మజిద్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. మత గురువులు హాఫీజ్, టిప్పు సుల్తాన్, హఫీజ్ కబీర్ నఈమ్, ఎస్ఎస్ఎఫ్ చైర్మన్ షంషుద్దీన్ పాల్గొన్నారు. ఎస్ఐ బాల నరసింహుడు బందోబస్తు నిర్వహించారు. ఆలూరు లోభారీ ర్యాలీ నిర్వహించారు. ఆస్పరిలో నమాజ్ నిర్వహించారు. ఇస్మాయిల్, ఖాదర్ గౌస్, మాబు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మసీదుల్లో నమాజ్ చేశారు.

పత్తికొండ టౌన్: ముస్లింలు జామీయా మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం బైక్, కాలినడకన జెండాలతో ర్యాలీ నిర్వహించారు.

దేవనకొండ: మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవనకొండలో సాయంత్రం ముస్లింలు ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించారు.

తుగ్గలి: మండలంలోని తుగ్గలి, జొన్నగిరి, రాంపురం కొట్టాల, హుశేనాపురం తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఈద్గాలో వెళ్లి నమాజు చేశారు.

కోసిగి: మక్కా, మదీనా ప్రతిమలను ట్రాక్టరుపై ఊరేగించారు. కోసిగిలోని జామియా, నూరాని సున్నీ, మదీనా, మజీద్, అక్సా మసీదుల్లో నమాజ్ చేశారు. సాతనూరులో నిర్వహించారు.

నందవరం: ముగతి, నందవరం, హలహర్వి, నాగలదిన్నె, సోమలగూడురులో సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించుకున్నారు.

మద్దికెర: సాయంత్రం ముస్లింలు పెద్దమసీదు నుంచి మహమ్మదీయా ప్రవక్త ప్రతిమతో ర్యాలీ నిర్వహించి గ్రామ శివారులోని ఈద్గాకు వెళ్లి నమాజు చేశారు. ఏఆర్ గోల్డుషాపు యజమాని అస్సర్ బాషా, మదీనా సప్లయర్ మస్తాన్ భోజనం ఏర్పాటు చేశారు.

కౌతాళం: ముల్లార్ వీధిలోని మసీదు నుంచి ముస్లింలు మక్కా మసీదు నమూనాతో ట్రాక్టర్ ర్యాలీ చేపట్టారు. ఖాదర్ లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ చిన్న మున్నా పాషా ఆధ్వర్యంలో జెండాలను పట్టుకుని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

గోనెగండ్ల: మండల కేంద్రంతోపాటు, హెచ్‌కైరవాడి, పెద్దనేలటూరు, గంజహళ్లి, పెద్దమరివీడు, కులుమాల, బైలుప్పల, గ్రామాల్లో ఫతేహాలు నిర్వహించారు. సీఐ గంగాధర్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నేడు ఎమ్మెల్యే కేఈ రాక

మద్దికెర, సెప్టెంబరు 16: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, బ్యాటరీ చార్జి సైకిళ్లు పంపిణీ చేయడానికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మంగళవారం వస్తున్నట్లు ఎంపీడీవో స్వర్ణలత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలియజేస్తూ మండలంలోని దివ్యాంగులకు పరికరాలు వచ్చాయని, పంపిణీకి ఎమ్మెల్యే రానున్నారని, మండలంలోని అన్ని శాఖల అధికారులు రావాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం

మద్దికెర, సెప్టెంబరు 16: ఎం.అగ్రహారం కృష్ణుని ఆలయ నిర్మాణానికి సహకరిస్తామని విద్యాసాయి కళాశాల ఎండీ యజ్ఞం వెంకట మాదవ, ప్రిన్సిపాల్ బాల సునీత అన్నారు. నిర్వాహకులకు రూ.51,116లు విరాళం ఇచ్చారు. మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, టీడీపీ కార్యదర్శి ధనుంజయుడు ఉన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

మద్దికెర, సెప్టెంబరు 16: గ్రామంలోని పంచాయతీ స్థలాలు ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా టీడీపీ నాయకుడు ఎస్.లక్ష్మీనారాయణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు, విద్యాకమిటీ చైర్మన్ బొల్లాపురం చంద్ర డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ బంకులు ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చుకుంటున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్పీ పాఠశాల వద్ద స్థలాలను కొందరు ఆక్రమించుకున్నారనీ, పంచాయతీ భవనాలు నిర్మించి వారికే అద్దెకు ఇవ్వాలని కోరారు.